

గురుకులం భద్రమేనా?

సారంగపూర్ మండలం జామ్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకులంలో సరైన భద్రత లేదు. గతంలో ఓ ఆగంతకుడు పాఠశాలలో చొరబడినా ఎవరూ గుర్తించలేకపోయారు. 9లో▸



క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఊరట

క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు వైద్యం అందించేందుకు వైద్యారోగ్యశాఖ చర్యలు చేపడుతోంది. ఆదిలాబాద్ లోని రిమ్స్ ఆస్పత్రిలో కీమో థెరపీ సెంటర్‌ను ఈనెల చివరి వారంలో ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 / 16.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

'గొడవలకు దిగొద్దు'

నిర్మల్‌టౌన్: పట్టణంలోని బుధవార్‌పేట్‌కాలనీలోని పాత సర్వే నంబర్ 15లోగల భూమికి సంబంధించి ఇరువర్గాలు గొడవలకు దిగవద్దని డీఎస్పీ జీవన్‌రెడ్డి సూచించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బుధవార్ పేట్ కాలనీకి చెందిన దళిత నాయకులు, సమీయుల్లాఖాన్ మధ్య కొంతకాలంగా పాత సర్వే నంబర్ 15భూమికి సంబంధించి గొడవలున్నాయి. ఈ విషయంపై ఆర్డీవో ఆదేశాల మేరకు అర్బన్ తహసీల్దార్, పట్టణ సీఐ, డీఎస్పీ సదరు భూమిని బుధవారం పరిశీలించారు. 145సీ ఆర్‌పీసీ ప్రకారం రెవెన్యూ శాఖ ఆ భూమిని అధీనంలోకి తీసుకుందని తెలిపారు. తదుపరి ఆదేశం వచ్చేవరకు సదరు భూమిలోకి అక్రమంగా ఎవరు ప్రవేశించరాదని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించి ఇరువు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

వేములవాడకు ప్రత్యేక బస్సులు

నిర్మల్‌టౌన్: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 17, 18తేదీల్లో నిర్మల్ నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు డిపో మేనేజర్ సాయన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే కాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కదిలి పాపహరీశ్వర ఆలయం, బూరుగుపల్లి శివాలయం, శ్రీరామ్ సాగర్ శివాలయం వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



ఫోన్ అప్పగిస్తున్న కండక్టర్, కంట్రోలర్

నిర్మల్‌టౌన్: నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కండక్టర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు.. మంగళవారం రాత్రి 8గంటలకు నిర్మల్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు నిజామాబాద్ నుంచి నిర్మల్‌కు బయలుదేరింది. బస్సు నిర్మల్‌కు చేరుకున్నాక కండక్టర్ సీటుపై మొబైల్ ఫోన్ కనిపించింది. కండక్టర్ రవీందర్ దానిని డిపో అధికారులకు అప్పగించాలనుకుంటుండగా బాధితుడు తాను పోగొట్టుకున్న ఫోన్‌కు కాల్ చేసి కండక్టర్‌కు వివరాలు తెలిపాడు. బుధవారం నిర్మల్‌కు వచ్చిన బాధితుడికి కండక్టర్ రవీందర్, డ్యూటీ కంట్రోలర్ ఫోన్ అప్పగించారు.

ముగిసిన మల్లన్న జాతర



పట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో ఆరురోజులుగా కొనసాగుతున్న మల్లన్న జాతర బుధవారం ముగిసింది. చివరిరోజు ఆనవాయితీ ప్రకారం మహిళలంతా గాజులు ధరించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఒగ్గు పూజారులు పట్నం వేశారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

గిరిజనశాఖ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే



క్రిస్టినాతో మాట్లాడుతున్న రేఖానాయక్

ఖానాపూర్: హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్‌చోంగ్తూ, తెలంగాణ రెవెన్యూశాఖ సెక్రటరీ నవీన్ మిట్టల్‌ను బుధవారం ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ కలిశారు. ఉట్నూర్‌లో బంజారా భవన నిర్మాణం కోసం స్థలం కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని గిరిజన గ్రామాలకు నిధులు మంజూరు చేయాలని, వంతెనల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని క్రిస్టినాను కోరినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులున్నారు.

అన్నదాత ఆగ్రహజ్వాల

- జిల్లాలో అప్రకటిత 'కోత'లు
- ఎండుతున్న వివిధ పంటలు
- ఆందోళన బాటలో రైతన్నలు
- జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు.. ధర్నాలు, సబ్‌స్టేషన్ల ముట్టడి



లోకేశ్వరం: విద్యుత్ కోతలతో నీరందక మండల కేంద్రంలో ఎండుతున్న వరి

వేళాపాలా లేకుండా ఇస్తున్న త్రీఫేజ్ కరెంట్ రైతులకు చుక్కలు చూపుతోంది. యాసంగిలో సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు అర్ధరాత్రి.. అపరాత్రి అనే తేడా లేకుండా అన్నదాతలు పొలంబాట పడుతున్నారు. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో.. తెలియని కరెంట్‌తో అవస్థలకు గురవుతున్నారు. ఎండుతున్న పంటలను చూసి అధికార యంత్రాంగంపై ఆక్రోశం వెల్లగక్కుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళనలకు దిగుతున్నారు. కొద్దిరోజులుగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తూ.. సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారు. బుధవారం కూడా జిల్లాలోని పలు మండలాల్లో రైతులు ఆందోళనలు కొనసాగించారు.



లోకేశ్వరం: పుస్పూర్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

పుస్పూర్ సబ్‌స్టేషన్ ముట్టడి

లోకేశ్వరం: అప్రకటిత కరెంట్ కోతలను నిరసిస్తూ రైతులు బుధవారం మండలంలోని పుస్పూర్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరెంట్ కోతల కారణంగా యాసంగిలో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. నిరంతరాయంగా 12 గంటల త్రీఫేజ్ కరెంట్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న విద్యుత్ ఏఈ శివకుమార్ సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి త్రీఫేజ్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు లింగాల పోతన్న, మోహన్‌రెడ్డి, గన్ను నర్సారెడ్డి, పోతారెడ్డి, సుధీర్‌రెడ్డి, నర్సారెడ్డి, భోజన్న, సాయన్న, విఠల్ తదితరులున్నారు.

మలక్‌చించోలి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా

సారంగపూర్: అప్రకటిత కరెంట్ కోతలను నిరసిస్తూ బుధవారం మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన రైతులు స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయానికి 24గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామన్న సీఎం కేసీఆర్ అమలులో విఫలమయ్యారని ఆరోపించారు. తరచూ కరెంట్ వేళల్లో మార్పులు చేస్తూ ఆందోళనకు గురి చేస్తున్నారని వాపోయారు. సకాలంలో నీటి తడులు అందక మొక్కజొన్న, వరి, జొన్న పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు సరఫరా వేళలు ప్రకటించి, 12గంటలైనా త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



మలక్‌చించోలి సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

రాంపూర్‌లో జాతీయ రహదారిపై రాస్తారోకో

నర్సాపూర్(జి): త్రీఫేజ్ విద్యుత్ కోతలను నిరసిస్తూ మండలంలోని రాంపూర్ రైతులు బుధవారం 61వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాస్తారోకోతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచి రాకపోకలకు అంతరాయమేర్పడింది. ఈ సందర్భంగా రైతులు డీఈఈ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కరెంట్ కోతలు లేకుండా చూడాలని కోరారు.



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రాంపూర్ గ్రామ రైతులు

'317'కూ ఛాన్స్..!



డీఈవో కార్యాలయం

- బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్‌లో మార్పు
- ఈ నెల 12నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తు గడువు
- జిల్లాలో 294 మందికి అవకాశం

ఇదీ.. వివరాలు	
మొత్తం ఉపాధ్యాయులు	2,434
బదిలీకి దరఖాస్తు చేసుకున్నవారు	1,557
జీవో 317తో ఇతర జిల్లాలకు వెళ్లినవారు	600
జీవో 317 ద్వారా జిల్లాకు వచ్చినవారు	294

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. జీవో 317 ద్వారా ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు కూడా బదిలీల్లో అవకాశం ఇవ్వాలంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వగా ప్రభుత్వం వారికి బదిలీల్లో ఛాన్స్ ఇచ్చింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో జీవో 317 ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ నెల 12నుంచి 14వరకు వీరు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ తేదీల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి.

జిల్లాలో 294 మంది '317' టీచర్లు

ఏడాది క్రితం జిల్లాలోని దాదాపు 600 మంది ఉపాధ్యాయులను జీవో 317 ద్వారా ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. ఇందులో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, పీఈటీలు, పండిట్లు ఉన్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో వీరికి అవకాశం ఇవ్వలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొందరు ఉపాధ్యాయులు హైకోర్టుకు వెళ్లారు. అయితే వీరందరికీ ఉమ్మడి జిల్లాలో వారి పాత సర్వీసును పరిగణనలోకి తీసుకొని బదిలీల్లో స్థానం కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. ఇతర జిల్లాల నుంచి 317 జీవో ప్రకారంగా సుమారు 294 మంది వివిధ కేటగిరీల్లో జిల్లాకు బదిలీ అయి వచ్చారు.

ఇదీ.. కొత్త షెడ్యూల్

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వం కొత్త షెడ్యూల్ ప్రకటించింది. దీని ప్రకారం 317 జీవో ఉపాధ్యాయులు ఈనెల 12నుంచి 14వరకు దరఖాస్తు చేసుకోవాలి. పాత జిల్లాలో పనిచేసిన సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకొని సీనియార్టీకి పాయింట్లు కేటాయిస్తారు. ఫిబ్రవరి 21, 22 తేదీల్లో సీనియార్టీ తుది జాబితాను ప్రకటిస్తారు. 24వ తేదీన ప్రధానోపాధ్యాయుల బదిలీలకు ఉత్తర్వులు జారీ చేస్తారు. 26, 27, 28 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లకు పీజీహెచ్‌ఎంలుగా పదోన్నతి, మార్చి 4, 5 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల బదిలీ, మార్చి 7, 8, 9 తేదీల్లో ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి, మార్చి 14వ తేదీన ఎస్జీటీలకు బదిలీలు నిర్వహిస్తారు. గత షెడ్యూల్ ప్రకారం మార్చి 4వ తేదీతో బదిలీల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా.. సవరించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 14 వరకు సాగనుంది.

స్థానికత కోసమే పోరాటం



జీవో నంబర్ 317 ద్వారా బదిలీ అయి ఇతర జిల్లాలకు వెళ్లాం. తిరిగి యథావిధిగా నిర్మల్ జిల్లాకే కేటాయిస్తే బాగుంటుంది. అసలు స్థానికత కోసమే పోరాటం చేస్తున్నాం. స్థానికేతరులకు ప్రయోజనం లేదు. ప్రభుత్వం పరిశీలించి స్థానిక జిల్లాలకు వెళ్లే అవకాశం కల్పించాలి. – శేరిరాజ్, ఉపాధ్యాయుడు

'317' ఉపాధ్యాయులకు మంచి అవకాశం



'317' ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వం మంచి అవకాశాన్ని ఇచ్చింది. ఈనెల 12నుంచి 14వ తేదీ వరకు మూడు రోజులపాటు దరఖాస్తులు స్వీకరిస్తాం. ఆ తర్వాత షెడ్యూల్ ప్రకారం దరఖాస్తులు స్వీకరించి సీనియార్టీ జాబితాను ప్రకటిస్తాం.
– రవీందర్‌రెడ్డి, డీఈవో

భాగస్వామికి... భరోసా



- భర్తను కోల్పోయిన వారికి పక్షం రోజుల్లో పింఛన్
- 'ఆసరా' నిబంధనలు సడలించిన రాష్ట్ర ప్రభుత్వం
- 57 ఏండ్లు పైబడితే వృద్ధాప్య, ఆలోపు వారికి వితంతు పింఛన్ మంజూరు
- ప్రతీనెల గుర్తించాలని ఆదేశాలు జారీ

జిల్లాలో పింఛన్ పొందుతున్న వారి వివరాలు	
పెన్షన్ దారులు	1,51,072
ఆసరా	37,666
వితంతు	37,781
దివ్యాంగులు	10,650
కల్లుగీత కార్మికులు	293
బీడీ కార్మికులు	62,481
ఒంటరి మహిళలు	2.148

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ప్రభుత్వం ఆసరా పింఛన్ల లబ్ధిదారులతోపాటు వారి భాగస్వామికీ భరోసా కల్పిస్తోంది. ఆసరా పింఛన్ పొందుతున్న భర్త మృతి చెందితే పక్షం రోజుల్లో జీవిత భాగస్వామికి పింఛన్ బదిలీ చేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. 57 ఏళ్ల నిండినవారైతే వృద్ధాప్య, ఆలోపు వారికి వితంతు పింఛన్ మంజూరు చేసేలా నిబంధనలను సడలించింది. ప్రతీనెల ఇలాంటి వారిని గుర్తించాలని ఉత్తర్వులు జారీ చేసింది. భార్య ఆధార్ కార్డుతోపాటు భర్త మరణ ధ్రువీకరణ పత్రాన్ని జతచేసి దరఖాస్తు చేసుకున్న పక్షం రోజుల్లో పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించింది.

ఎన్నాళ్లకో మోక్షం..

ఆసరా పింఛన్ దరఖాస్తులను ప్రభుత్వం దాదాపు మూడేళ్లుగా పక్కన పెట్టింది. గతేడాది ఆగస్టులో కొత్త పింఛన్లు మంజూరు చేసింది. ఇందులో అన్ని విభాగాల్లో అర్హులను గుర్తించారు. భర్త మృతి చెందితే అతడి స్థానంలో భార్యకు మంజూరు చేయలేదు. వితంతు విభాగం కింద దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. సకాలంలో పింఛన్ మంజూరు కాకపోవడంతో చాలామంది వితంతువులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో వినతులు అందిస్తున్నారు. వీరికి ప్రత్యేక వెసులుబాటు లేకపోవడంతో అధికారులు సైతం ఏంచేయలేని పరిస్థితి. ప్రస్తుతం జీవిత భాగస్వామికి ఆసరా పింఛన్ నిర్ణయంతో సమస్య పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి.


15 రోజుల్లోనే..

వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులు, హెచ్ఐవీ బాధితులు, డయాలసిస్ రోగులు, బోదకాలు వ్యాధిగ్రస్తులు ఇలా అనేక మందికి ప్రతినెలా ప్రభుత్వం ఆసరా పింఛన్ల రూపంలో రూ.2,016, రూ.3,016 అందిస్తోంది. ఇంట్లో ఒకరికి మాత్రమే పింఛన్ అందిస్తున్నారు. లబ్ధిదారు మరణిస్తే పింఛన్‌కోసం జీవిత భాగస్వామి నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ అలాంటి మహిళలకు దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అర్హులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

దరఖాస్తు విధానం..

వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు మరణిస్తే ధ్రువీకరణ పత్రంతోపాటు భాగస్వామి ఆధార్‌కార్డుతో దరఖాస్తును గ్రామాల్లో అయితే పంచాయతీ కార్యదర్శికి, పట్టణాల్లో అయితే పురపాలక సంఘంలో అందజేయాలి. వాటిని పరిశీలించిన అధికారులు ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు పంపిస్తారు. ఈ ప్రక్రియ అంతా 15 రోజుల్లో పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులను గుర్తిస్తాం




వృద్ధాప్య పింఛన్‌దారు మరణిస్తే అతడి స్థానంలో జీవిత భాగస్వామికి అందించాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులు స్వీకరించి అర్హులను గుర్తిస్తాం.
– విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్

ఆగి ఉన్న లారీని ఢీకొని రైతు దుర్మరణం



ఘటనా స్థలంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

- పాండ్వపూర్ చెక్‌పోస్ట్ వద్ద ఘటన
- మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన
- చెక్‌పోస్ట్ కార్యాలయం ధ్వంసం



మల్లేశ్ (ఫైల్)



కాలిపోతున్న అటవీశాఖ కార్యాలయంలోని సామగ్రి

కడెం: మండలంలోని పాండ్వపూర్ అటవీ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాండ్వపూర్ గ్రామానికి చెందిన గుడివెనుక నడిపి మల్లేశ్ (40) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కావడంతో మల్లేశ్ ద్విచక్రవాహనంపై గ్రామ సమీపంలోని వరి పంటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. వ్యవసాయ మోటర్ ఆన్ చేసి ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో చెక్‌పోస్ట్ వద్ద ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మల్లేశ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య అనూష, ఇద్దరు కుమారులున్నారు.

గ్రామస్తుల ఆందోళన

సమాచారం తెలుసుకున్న పాండ్వపూర్ గ్రామస్తులు చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నారు. అటవీ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ఆగ్రహించి అటవీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. అందులోని కంప్యూటర్, సీసీ కెమెరా తదితర సామగ్రిని తగులబెట్టారు. అటవీ అధికారులు ఎంట్రీ ఫీజు పేరుతో డబ్బులు వసూలు చేయడంతోనే వాహనాలు రోడ్డుపై నిలిచి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆరోపించారు. చెక్‌పోస్ట్‌ను ఎత్తివేయాలని నినదించారు. ఆందోళనతో నిర్మల్–మంచిర్యాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి చేరుకుని బాధితులతో మాట్లాడారు. చెక్‌పోస్టు తొలగిస్తామని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

14న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నిర్మల్ రూరల్: ఈనెల 14న ఉదయం 10.30గంటలకు జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సీఈవో సుధీర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

నిందితుడిని కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: పలు ఐపీసీ కేసుల్లో నిందితుడిగా ఉండి గత రెండేళ్లుగా కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్న వ్యక్తిని టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని అకోలకు చెందిన అబ్దుల్ గనిపై కోర్టు నాన్‌బెయిల్ వారెంట్ జారీ చేసింది. దీంతో అతడిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు టూటౌన్ సీఐ పురుషోత్తం చారి తెలిపారు.

వడ్డెపల్లిలో గుడుంబా పట్టివేత


పట్టుకున్న గుడుంబాతో రవికుమార్

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాం గ్రామానికి అనుబంధ గ్రామమైన వడ్డెపల్లిలో నిషేధిత గుడుంబాను పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై రవికుమార్ తెలిపారు. మండలంలోని బోరిగాం గ్రామానికి అనుబంధ గ్రామమైన వడ్డెపల్లిలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలో రెండు ప్రదేశాల్లో నిషేధిత గుడుంబాను పట్టుకున్నారు. అనంతరం గుడుంబా తయారీకి వినియోగించే 400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత గుడుంబాను ఎవరు తయారు చేసినా, రవాణా చేసినా, అమ్మినా కేసులు తప్పవన్నారు. ఇందులో ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, గౌతం, రవీందర్, రాజశేఖర్, కల్పన ఉన్నారు.

మనిషి కుడి కాలు స్వాధీనం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతంలో పాత జాతీయ రహదారి పక్కన మనిషికి సంబంధించిన కుడి కాలు బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జాతీయ రహదారి గుండా వెళ్తున్న ఓ వ్యక్తికి జాతీయ రహదారి పక్కాన మనిషికి సంబంధించిన కాలు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. లభ్యమైన కాలు మెడికల్ వెస్టేజ్‌గా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన గోరేకర్ సుభాశ్ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం .. ఇంద్రవెల్లి పీహెచ్‌సీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సుభాశ్ గత నెల 8న ఆదిలాబాద్ బస్టాండ్‌లో తన బైక్ పార్కింగ్ చేసి బస్సులో ఉదయం 10 గంటలకు బయలుదేరి వెళ్లాడు. సాయంత్రం విధులు ముగించుకొని ఆదిలాబాద్ పట్టణానికి చేరుకున్నాడు. బస్టాండ్‌లో బైక్ కనిపించకుండా పోయింది. దీంతో పరిసర ప్రాంతాల్లో బైక్ కోసం గాలించగా దొరకకపోవడంతో బుధవారం టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండలంలోని గుల్లకోట స్టేజీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కన్నెపల్లి మండలం దాంపూర్ గ్రామానికి చెందిన శశికుమార్, రవికుమార్, వినోద్ లక్సెట్టిపేట నుంచి ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా గుల్లకోట స్టేజీ వద్ద ఎదురుగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఊరట

- రిమ్స్‌లో కిమో థెరపీ సెంటర్
- ప్రత్యేక బెడ్లు ఏర్పాటు
- త్వరలో స్క్రీనింగ్ పరీక్షలు


రిమ్స్‌లో కిమో థెరపీ గదిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు వైద్యం అందించేందుకు వైద్యారోగ్య శాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రిమ్స్ ఆస్పత్రిలో కిమో థెరపీ సెంటర్‌ను ఈనెల చివరి వారంలో ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. వసతులు కల్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రిమ్స్ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఓ గదిని ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద కిమోథెరపీ సెంటర్‌ను ప్రారంభించనుండగా, అందులో ఆదిలాబాద్ జిల్లాను ఎంపిక చేశారు. గతంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం కింద క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కోవిడ్ కారణంగా అప్పట్లో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే ప్రస్తుతం వారికి రిమ్స్‌లోని పాలియేటీవ్ సెంటర్‌లో వైద్యసేవలు అందుతున్నాయి. ఇదిలా ఉండగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌లు బుధవారం రిమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కిమో థెరపీ గదిని పరిశీలించారు.

జిల్లాలో క్యాన్సర్ పరీక్షలు..

ఆదిలాబాద్ జిల్లాలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు అధికంగానే ఉన్నారు. దాదాపు 500 మందికి పైగా ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. క్యాన్సర్ ప్రాథమిక దశలో ఉన్నవారిని గుర్తించి వారికి వైద్య సేవలు అందిస్తే క్యాన్సర్ బారినుంచి బయటపడే అవకాశం ఉంటుంది. జిల్లాలో ప్రస్తుతం క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు వైద్యం అందుబాటులో లేకపోవడంతో హైదరాబాద్, నిజామాబాద్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. పేద ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రభుత్వం రిమ్స్‌లో క్యాన్సర్ పరీక్షలు చేసేందుకు సిద్ధమైంది.

కిమోథెరపీ సెంటర్ ఏర్పాటు..

క్యాన్సర్ బారినపడిన వ్యాధిగ్రస్తులకు కిమో థెరపీ అందించేందుకు వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టింది. రిమ్స్‌లో ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. 5 బెడ్లతో ఈ గదిని సిద్ధం చేశారు. ఈనెల చివరి వారంలో ప్రారంభించనున్నారు. ఈ సెంటర్‌లో ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులను నియమించనున్నారు. వీరితో పాటు రిమ్స్‌లో పనిచేసే రేడియాలజిస్టులు వీరిని పరీక్షలు చేయనున్నారు. అయితే స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియ పూర్తయ్యింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఓ వైద్యాధికారిని డిప్యూటేషన్‌పై ఈ కేంద్రానికి మెడికల్ ఆఫీసర్‌ను నియమించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. స్టాఫ్ నర్సు, మెడికల్ ఆఫీసర్లకు హైదరాబాద్‌లో వారం, పది రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొంటున్నారు. హైదరాబాద్‌లో కిమో థెరపీ చేయించుకుంటున్న వారికి దూరభారంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తగ్గనున్నాయి.

ఏర్పాట్లు చేస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిమ్స్‌లో కిమోథెరపీ సెంటర్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రిమ్స్ డైరెక్టర్ ఇందుకు ఓ గదిని కేటాయించారు. ఈనెల చివరి వారంలో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. దీంతో వ్యాధిగ్రస్తులకు దూరభారం తగ్గనుంది. రిమ్స్‌లో ఎల్డర్‌కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. 60ఏళ్లు పైబడిన వారికి ఫిజియోథెరపీ చేయడం జరుగుతుంది. ఈ కేంద్రాన్ని కూడా రిమ్స్‌లో ఏర్పాటు చేస్తాం.
– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌ఓ, ఆదిలాబాద్

బెల్ట్‌షాపులు తొలగించాలి


వినతిపత్రం అందిస్తున్న నళినిరెడ్డి

ఎదులాపురం: బెల్ట్ షాపులను తొలగించాలని, గుట్కా, తంబాకు వంటి మత్తు పదార్థాలను నిషేధించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ముడుపు నళినిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇమాన్యూయేల్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గల్లీగల్లీలో, గ్రామగ్రామాన బెల్ట్ షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేశారని తెలిపారు. గుట్కా, తంబాకు విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం మద్యం పేరుతో చీప్ లిక్కర్ అమ్మకాలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వివరించారు. వీటిని అదుపు చేయాల్సిన ఎక్సైజ్ శాఖ పట్టనట్టు ఉండడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖ పేరుకే పరిమితం అవుతోందన్నారు. ఇప్పటికైనా బాధ్యత వహించి బెల్ట్ షాపులను తొలగించాలని, నిషేధిత గుట్కా, తంబాకు అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర సమితి సభ్యులు అమీనా, సంగీత, జిల్లా నాయకురాలు సంగీత, శబాన, రేఖ, పూజ ఉన్నారు.

ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్య


రిమ్స్ మార్చురిలో ఎరాజ్ మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో ఓ వస్త్ర వ్యాపారి దుకాణంలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన మహ్మద్ ఎరాజ్ (30) సినిమా రోడ్‌లో ఓ బట్టల షాప్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి 9గంటల ప్రాంతంలో దుకాణంలో పనిచేసే వర్కర్లు ఆయన కోసం కింద వేచిచూడగా ఆయన రెండో అంతస్తులోనే ఉండిపోయాడు. ఎంతసేపైన కిందికి రాకపోవడంతో వారుపై అంతస్తుకు వెళ్లారు. అక్కడ గదికి లోపల నుంచి తలుపులు పెట్టేసి ఉండడంతో అనుమానం వచ్చి తలుపు పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో వారు పోలీసులతో పాటు ఆయన కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడికి ఎనిమిది నెలల క్రితమే వివాహమైంది. సూసైడ్ నోట్‌లో తన చావుకు ఎవరు బాధ్యులు కాదని రాసి ఉంచినట్లు పోలీసులు వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు.

గిరిజన యువతకు ఉపాధి కల్పిస్తాం

- పెసా కో–ఆర్డినేటర్ వసంత్‌రావ్


యువతకు శిక్షణ ఇస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఐటీడీఏ గిరిజన మత్స్యకార శాఖ ఆధ్వర్యంలో గిరిజన యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు పెసా కో–ఆర్డినేటర్ వసంత్‌రావ్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్నూర్ త్రివేణి సంఘం చెరువులో గిరిజన యువకులు, రైతులకు చేపల వేటపై శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో 290 చెరువులు ఉన్నాయని, ఆ చెరువుల్లో చేపల పెంపకానికి ఐటీడీఏ మత్స్యకార సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు శిక్షణ ఇచ్చి.. ఎంపికైన వారితో సంఘాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఏజెన్సీ ప్రాంతంలోని చెరువుల్లో చేపల పెంపకానికి హక్కు పత్రాలు ఇచ్చి ఉపాధి కల్పించడం జరుగుతోందని వివరించారు. గిరిజన యువత, రైతులు మత్స్యకార శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పెసా కమిటీ సభ్యులు మెస్రం చిత్రు, భీంరావ్ ఉన్నారు.

నేటి నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, ఒకేషనల్, బీసీఏ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 49, ఖమ్మంలో 34, ఆదిలాబాద్ జిల్లాలో 50 చొప్పున మొత్తంగా 113 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తంగా 75,869మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో ఒక చీఫ్ సూపరింటెండెంట్, అబ్జర్వర్ చొప్పున 2,663మంది సిబ్బందిని నియమించారు. ఈ నెల 9, 10, 13, 14, 15, 16, 17, 20, 21, 22వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతీ జిల్లాలో స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి కూడా ప్రత్యేకంగా స్క్వాడ్ బృందం ఉంటుంది.

ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

కై లాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల ఫోన్ నెంబర్లు మారినట్లు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఇక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఏసీబీ డీఎస్పీ ఫోన్ నం. 91543 88963, ఇన్‌స్పెక్టర్ 91543 88964, ఇన్‌స్పెక్టర్ 91543 88965గా మారినట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి అవినీతి అధికారులకు సంబంధించిన సమాచారాన్ని ఈ నెంబర్ల ద్వారా అందించాలని ఆయన సూచించారు.

బాల్య వివాహం అడ్డగింత

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(జి) గ్రామంలో బుధవారం జరిగిన బాల్య వివాహాన్ని మండల అధికారులు తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్సై పాకాల గీత అడ్డుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి నిర్మల్‌కి తరలించారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని ఎస్సై పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజినిదేవి, ఆర్‌ఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మందమర్రిలో పట్టపగలే చోరీ

మందమర్రిరూరల్: పట్టణంలోని మొదటి జోన్‌లో ఉన్న 114వ నంబర్ క్వార్టర్‌లో బుధవారం పట్టపగలే దొంగలు పడ్డారు. కాలనీకి చెందిన శ్రీనివాస్ మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి మార్కెట్‌కు వెళ్లాడు. గంట తర్వాత ఇంటికి వచ్చి తాళం తీసి చూడగా వెనుకాల తలుపులు తొలగించి ఉన్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. సామాగ్రి చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో దాచి ఉంచిన రూ.80 వేల నగదు, తులం బంగారు గొలుసు, పది సిల్వర్ కాయిన్స్, రెండు బంగారు రింగులు చోరీకి గురైనట్లు గుర్తించి బాధితుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

అర్ధరాత్రి దొంగల బీభత్సం


ఏటీఎం నుంచి ఆధారాలు స్వీకరిస్తున్న క్లూస్ టీం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లోని పలు దుకాణాల్లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. పలు దుకాణాల తాళాలు పగలగొట్టి సామగ్రిని ఎత్తుకెళ్లారు. స్థానిక మారుతి మెగా మార్ట్ పక్కనే గల ఇండియన్ వన్ ఏటీఎంను ధ్వంసం చేసి చోరీకి యత్నించారు. గంగా కాంప్లెక్స్‌లో బట్టల దుకాణంలో దాదాపు రూ.10వేల విలువైన బట్టలు అపహరించారు. దీని సమీపంలోని సెల్ పాయింట్ ధ్వంసం చేసి చోరీకి ప్రయత్నం చేశారు. పక్కన ఉన్న మెడికల్ దుకాణం తాళం పగలగొట్టారు. బుధవారం ఉదయం విషయం తెలుసుకున్న పోలీసులు చోరీ జరిగిన దుకాణాలను పరిశీలించారు. క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొడుకు చితికి నిప్పపెట్టిన తల్లి


కొడుకు అంతిమయాత్రలో తల్లి రాజేశ్వరి

వేమనపల్లి(బెల్లంపల్లి): తన కన్నీళ్లు తుడుస్తాడనుకున్న కుమారుడు బ్రెయిన్‌స్ట్రోక్‌తో కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆతల్లి రోదనలు మిన్నంటాయి. మండలంలోని నీల్వాయికి చెందిన పున్నపురెడ్డి మధుకర్–రాజేశ్వరి దంపతులకు కుమారుడు సాయికుమార్, కూతురు పల్లవి సంతానం. సాయికుమార్ పదో తరగతి, ఇంటర్‌లో ఉన్నత శ్రేణి మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. తండ్రి మధుకర్ ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా తల్లి రాజేశ్వరి అన్నీతానై పిల్లలిద్దర్నీ చదివించింది. కుమారుడు ఢిల్లీలో ఐఐటీ పూర్తి చేసి మూడునెలల క్రితం బాచ్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరాడు. మంగళవారం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో బెంగళూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువుల సహకారంతో మృతదేహాన్ని నీల్వాయికి తరలించారు. పుట్టెడు దుఃఖంలో తల్లి రాజేశ్వరి తలకొరివి పెట్టి అంతిమ సంస్కారాలు చేసింది.

39 రోజులకు స్వగ్రామానికి మృతదేహం


మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ జమీర్(25) సౌదీలో గదిలో ఏర్పాటు చేసిన వార్మర్ నుంచి వెలువడిన పొగతో అస్వస్థతకు గురై జనవరి 1వ తేదీని మృతిచెందాడు. ధవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక ఆధ్వర్యంలో మృతదేహంపై జెండాను కప్పి ఘనంగా నివాళి అర్పించారు. 39 రోజుల తర్వాత స్వగ్రామానికి రావడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో దొంగతనం


పగలగొట్టిన బీరువా చూపుతున్న సిబ్బంది

నార్నూర్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ వివరాల ప్రకారం... బుధవారం ప్రార్థన సమయానికి పాఠశాల ఉపాధ్యాయులు చేరుకున్నారు. పాఠశాల కార్యాలయం తలుపులు తెరిచి ఉండడంతో లోపలికివెళ్లి చూడగా 42 ఇంచుల ఎల్‌ఈడీ టీవీ, హోం థియేటర్ చోరీకి గురైందని గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని ఏఎస్సై గంగారెడ్డి పరిశీలించి వివరాలు సేకరించారు. హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్మన్ గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆగ్రో ఉద్యోగుల సంఘం ఔదార్యం

- సహచర ఉద్యోగి కుటుంబానికి చేయూత


నగదును అందజేస్తున్న విలాస్‌రెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ ఆగ్రో ఉద్యోగుల సంఘం తన ఔదార్యాన్ని చాటుకుంది. ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జైనథ్ మండలం పెండల్వాడ గ్రామానికి చెందిన సహచర ఉద్యోగి ఆశన్న కుటుంబానికి అండగా నిలిచింది. ఆగ్రో డీలర్లు, వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న సహచర ఉద్యోగులు తమ స్తోమతకు తగ్గట్లుగా విరాళాల ద్వారా రూ. 6,95,000 పోగు చేశారు. బుధవారం ఆ నగదును మృతుడి భార్య, కూతురికి ఆగ్రో డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు విలాస్ రెడ్డి, వ్యవసాయ అధికారి భగత్ రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆగ్రో ఉద్యోగుల సంఘం ప్రతినిధి గంధ్రత్ సంతోష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 8మంది సహచర ఉద్యోగులు వివిధ ప్రమాదాల్లో మరణించగా ఆ కుటుంబాలకు అగ్రో ఉద్యోగులు తమ వంతుగా చేయూతనివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆగ్రో డీలర్స్ ప్రతినిధులు తాటిపెల్లి శివ ప్రసాద్, ఆగ్రో ఉద్యోగులు యాకూబ్, రవికాంత్, ముక్తార్ ,విలాస్, గజానన్, సతీష్ రెడ్డి, కశ్యప్ రెడ్డి పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల వాడకం నేరం

- డీఎస్పీ జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

కడెం: లైసెన్స్ లేకుండా పేలుడు పదార్థాలను వాడడం చట్టరీత్యా నేరమని డీఎస్పీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల మండలంలోని మొర్రిపేట్ గ్రామ సమీపంలో పేలుడు (38 స్లర్రి స్టిక్స్) పదార్థాలు లభ్యం కాగా బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈనెల 6న మొర్రిపేట్ అటవీ బీట్ పరిధిలో ఫైర్‌లైన్స్ చేయిస్తున్న ఎఫ్‌బీవో బండారి శంకర్‌కు కల్వర్టు కింద సంచిలో పేలుడు పదార్థాలు కనిపించగా కడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారిస్తున్న క్రమంలో బుధవారం మండలంలోని రాంపూర్ గ్రామం వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు ఉట్నూర్ వైపు నుంచి ఉడుంపూర్ వైపు వస్తున్న కంప్రెషర్ ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. ట్రాక్టర్ సీటు కింద పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో యాదాద్రి భువనగిరి జిల్లా మోతుకూరు మండలం దత్తప్ప గూడేనికి చెందిన గొలుసుల విజయ్ కొంత కాలంగా అల్లంపల్లి చుట్టు పక్కల గ్రామాల్లో వ్యవసాయ బావుల్లో పేలుడు పదార్థాలతో రాళ్లను పగులగొడుతూ ఉపాధి పొందుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలో విజయ్ మిగిలిన పేలుడు పదార్థాలను మొర్రిపేట్ సమీపంలోని కల్వర్టు కింద దాచి పెట్టినట్లు నిజం ఒప్పుకోగా పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. సమావేశంలో సీఐ అజయ్‌బాబు, ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శుద్ధజలం.. అపరిశుభ్రం



వేసవి ప్రారంభం కావడంతో ప్యూరిఫైడ్ వాటర్ గిరాకీ పెరిగింది. దీంతో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. నాచుపట్టిన క్యాన్లలో నీటిని సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. నిర్మల్ పట్టణంలోని ఓ ప్లాంట్ నుంచి ఇలా నాచుపట్టిన క్యాన్లలో తాగునీరు తీసుకువెళ్తుండగా తీసిన చిత్రమిది.
– సాక్షి ఫొటో గ్రాఫర్, నిర్మల్



ఇదేం వైరింగ్ వ్యవస్థ..

కలెక్టర్ కార్యాలయంలో విద్యుత్ వైరింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్ వైర్లకు సంబంధించి కవర్ బోర్డులు లేకపోవడంతో గోడలపై విద్యుత్ వైర్లు బయటనే వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. కలెక్టరేట్‌ను సందర్శించేవారు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదం తలెత్తకమానని పరిస్థితి నెలకొంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్